క్లుప్తంగా

రేపు మేకల సంత వేలం

చారకొండ: మండలంలోని జూపల్లిలో ప్రతి ఆదివారం నిర్వహించే గొర్రెల, మేకల సంతకు గురువారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి తహసీల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు బుధవారం సాయంత్రం 4 గంటల వరకు జూపల్లి గ్రామ పంచాయతీ పేరున రూ.50 వేలు డీడీ తీసి అధికారులకు అందజేయాలని తెలిపారు. ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తునట్లు తెలిపారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి చేయూత

లింగాల: మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ సురేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో నియోజకవర్గ, మండల ఫొటోగ్రాఫర్ల యూనియన్ల నాయకులు బాధిత కుటుంబానికి బాసటగా నిలిచాయి. మంగళవారం సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి తల్లిదండ్రులకు రూ.6,800ల నగదును ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తాటికొండ గిరి, సలేశ్వరం, భాస్కర్, ఫొటోగ్రాఫర్లు ఆనంద్, అనిల్, రంజిత్, రాజు, కల్యాణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరిగాలెన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రతాప రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్వామిరెడ్డి, తిరుపతయ్య, మల్లేష్, పాల్గొన్నారు.

'చలో అచ్చంపేట' వాల్‌పోస్టర్లు విడుదల



లింగాల: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హలో మాదిగ చలో అచ్చంపేట వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 5న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన మాదిగలు డప్పులతో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు మంగళవారం ముగిసాయి. మొత్తం పది జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు శివారెడ్డి, వెంకటేష్, మహేష్‌లు తెలిపారు. సాయికిరణ్ జట్టు మొదటి బహుమతి గెలుపొందగా, శివరామ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విజేతలకు ఆర్మీ జవాన్ కె. రాజు, పి. రమేష్ సహకారంతో బహుమతులను అందజేసినట్లు వివరించారు.

రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడికి సన్మానం

కల్వకుర్తి రూరల్: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన బీచని బాలకృష్ణను మంగళవారం 1993 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు పట్టణంలో ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో జిల్లా స్థాయి పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్రులు అరుణ్‌కుమార్ రెడ్డి, జగదీష్, వెంకటరెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్ బాబు, శ్రీధర్, సునీల్ కుమార్, వెంకటస్వామి, శ్రీనివాస్, ఖాజా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐకి వినతి

తాడూరు: మత్తుపదార్థాలకు బానిసలవుతున్న యువతను కాపాడాలని మండలంలోని బలాన్‌పల్లి గ్రామస్తులు సీఐ కనకయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొందరు ఆకతాయిలు పర్వతాయిపల్లి రహదారిలో గంజాయిని సేవించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. మత్తు పదార్థాలు తిమ్మాజిపేట మండలం బవాజిపల్లి, యత్మతాపూర్ గ్రామాల నుంచి సరఫరా అవుతోందని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో వంతెన

- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన జటప్రోలు బ్రిడ్జి



బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలు వద్ద నాలుగు దశాబ్దాల కిందట ప్రయాణికుల సౌకర్యార్థం వంతెనను నిర్మించారు. 1984 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రావు బ్రిడ్జిని ప్రారంభించారు. దీంతో కొల్లాపూర్ నుంచి పెంట్లవెల్లి, జటప్రోలు, పెబ్బేరు వయా కర్నూల్ వరకు నిత్యం 24 గంటలు పాటు బస్సులు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం జటప్రోలు బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఎప్పుడు ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే, మంత్రి, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం కొల్లాపూర్ నుంచి పెబ్బేరు ప్రధాన రహదారి కావడంతో ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. బ్రిడ్జిపై ఇరువైపులా ప్రహరీ పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి కింద దాదాపు 20 మీటర్ల మేరకు ఆరు నెలల పాటు కృష్ణానది నీరు ప్రవహిస్తుంటుంది. రెండు సంవత్సరాల కిందట లారి అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి నదిలో పడింది. ఎవరికి ఏప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు శ్రద్ధ వహించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పాలకులు పట్టించుకోవడం లేదు



బ్రిడ్జి పూర్తిస్థాయిలో దెబ్బతిన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే 40 సంవత్సరాలు దాటడంతో శిథిలావస్థకు చేరింది. నిత్యం భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుందో తెలియని పరిస్థితి. అధికారులు తక్షణమే స్పందించి నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.

– హనుమంతు, జటప్రోలు

భయంగా ఉంది



బ్రిడ్జిపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. నిత్యం పెంట్లవెల్లి, కొల్లాపూర్‌లకు ప్రయాణిస్తుంటాం. కొత్త వంతెన నిర్మించాలని ఎన్నోసార్లు మా గ్రామానికి వచ్చిన నాయకులకు ఎమ్మెల్యే, మంత్రులకు కూడా అర్జీలు పెట్టుకున్నాం. ఏ ఒక్కరు కూడా స్పందించలేదు. కూలేందుకు వంతెన సిద్ధంగా ఉంది. మంత్రి చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి.

– శ్రీనివాసులు, జటప్రోలు

విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి



కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీపీఎం, బీఆర్‌ఎస్‌వీ నాయకులు



ఉప్పునుంతలలో పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం చేపట్టిన 'చలో హెచ్‌సీయూ' కార్యక్రమానికి వెళ్లకుండా మంగళవారం సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ, బీఆర్‌ఎస్‌వీ, స్వేరో, ఏఐఎస్‌ఎఫ్, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. 400 ఎకరాల భూములను అమ్మకుండా అడ్డుకొని పోరాడుతున్న విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. కోడేరులో సీపీఎం నాయకులను, తిమ్మాజిపేటలో స్వేరో నాయకులను, కొల్లాపూర్‌లో సీపీఎం, బీఆర్‌ఎస్‌వీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని సొంతపూచీకత్తుపై వదిలిపెట్టారు.



కోడేరులో సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

భూముల వేలాన్ని ఆపాలి



నాగర్‌కర్నూల్ రూరల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణకై విద్యార్థులు పోరాటం చేస్తుంటే వారిని అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. తక్షణమే అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు, శివ, మహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఎస్సీ కాలనీలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను, డ్రైనేజీ పనులను కాంగ్రెస్ నాయకుల ప్రారంభించారు. చింతకుంట్ల విరయ్య ఇంటి నుంచి సల్వాడి అంకాలు ఇంటివరకు రూ.3 లక్షల వ్యయంతో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, బొందయ్య నుంచి మల్లయ్య నుంచి రూ.4 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనుల ప్రారంభమయ్యాయి. బస్టాండ్ సమీపంలోని గంగయ్య నుంచి అంకాలు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణపనులు కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధికి మొత్తం రూ.10 లక్షలు మంజూరైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సాయిబ్, రాజారెడ్డి, శ్రీను, బోయ మల్లయ్య, గణేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలకే సబ్‌ప్లాన్ నిధులు వినియోగించాలి



తాడూరు: దళితవాడల అభివృద్ధి కోసమే సబ్‌ప్లాన్ నిధులు వినియోగించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అంతారం, అకునెల్లికుదురు గ్రామాలను ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో దళితవాడల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికి కొందరు అంటరానితనం పాటిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులనిర్మూలన కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు బంగారయ్య, అంజనేయులు, హన్మంతు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేసిన భక్తులు

తాడూరు: మండల కేంద్రంలో మంగళవారం పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, భోజన వసతి కల్పించారు.

పెద్దాపూర్‌లో అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో మంగళవారం మాజీ జెడ్పీటీసీ పబ్బు జంగయ్యగౌడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాజీ ఎంపీటీసీ చక్రవర్తిగౌడు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని స్థానికుడు పాపిశెట్టి రామన్న ప్రారంభించారు. ఈ చలివేంద్రంతో శ్రీశైలం ప్రయాణికులకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శ్రీనునాయక్, శేఖర్, రమేష్ తదితరులు ఉన్నారు.

సింగోటంలో చలివేంద్రం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా ఇటీవల గ్రామానికి చెందిన ఐదు మంది ప్రభుత్వ ఉద్యోగులు పొందటంతో వారిని సన్మానించారు. సంస్థ అధ్యక్షుడు బాలకిష్టయ్య, ప్రధాన కార్యదర్శి చింతకుంట భాస్కర్, కార్యవర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడీలదే ప్రధాన పాత్ర



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఎత్తం చిట్టెమ్మ

వీపనగండ్ల: పసిపిల్లల ఆరోగ్యాన్ని సంరక్షిచడంలో అంగన్‌వాడీ టీచర్లు గురుతర బాధ్యత పోషిస్తున్నారని మహిళా సంఘం నాయకురాలు ఎత్తం చిట్టెమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సంఘ సభ్యులు పలువురు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ప్రభుత్వం నుంచి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, గుడ్లను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతం కోసం వసతులు కల్పిస్తుందని, టీచర్లు, హెల్పర్లు వాటిని సకాలంలో లబ్ధిదారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘ కార్యదర్శి ముంత అలివేల, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరి, ఎల్లమ్మ, హెల్పర్లు లచ్చమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

తిమ్మాజిపేట: మండలం ఆవంచలో మహాలక్ష్మి, గోదాసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు బుధవారం ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణాహవాచనము, ముత్సంగ్రహణం, అంకురార్పణ, మంగళ శాసనం, ధ్వజ కుంబారాధన, సేవాకాలం, చతుస్థానార్చన, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్రమంత్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రెండోరోజు 3 వతేదీన స్వామి వారి కల్యాణోత్సవం, నారసింహ హోమం, రథాంగ హోమం, అదే రోజు రాత్రి రథోత్సవం(తేరు), 4న యాగశాల, నిత్యారాధన, మహాబలి, కుంభోద్వాసనం, ఆవబుథ స్నపనం, చక్రస్నానం, దేవతోద్వాసనం, పుష్పయాగం, ధ్వజారోహణం, సాయంత్రం బండ్ల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొల్లాపూర్ మాట్లాడుతున్న దేవని కుమార్‌మాదిగ



చారకొండ మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు శ్రీనివాసులు

సాక్షి, నెట్‌వర్క్: నానాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట ఆంజనేయ స్వామి దర్శనానికి వెళ్లిన మహిళపై 9 మంది సామూహిక లైంగిక దాడికి పాల్పడిన విషయం విధితమే. మంగళవారం ఘటనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నాగర్‌కర్నూల్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షులు పరశురాం, టీం సభ్యులు శివ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దేవని కుమార్‌మాదిగ విలేకరులతో మాట్లాడుతూ మహిళపై అత్యాచారం ఘటన సిగ్గుచేటన్నారు. చారకొండలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు మహిళపై లైంగిక దాడిని ఖండించారు.



నాగర్‌కర్నూల్ అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పేదల ఇళ్ల నిర్మాణాలకు చేయూత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదలకు రెండు ఇళ్లు నిర్మించేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ముందుకు వచ్చారు. ఈ మేరకు మంగళవారం ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. అంతకుముందు అగ్ని ప్రమాదానికి గురై ఆర్థికంగా రూ.లక్షలు నష్టపోయిన రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాలిపోయిన దుకాణాలను పరిశీలించారు. రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి కల్మచర్ల రమేష్, అదనపు కార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షుడు ప్రసాద్, పట్టణాధ్యక్షుడు శేఖర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బీచాని బాలకష్ణ, నాయకులు మధు, సూర్య ప్రకాష్ రావు, జంగయ్య, గణేష్, రమేష్, భగత్ సింగ్, కాజా, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతరం పోరాటం



చారకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై 1104 యూనియన్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేసి హక్కులు సాధిస్తామని మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జూపల్లిలో జూనియర్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్న అయూబ్‌ఖాన్‌ను యూనియన్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కల్వకుర్తి డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ తిర్పతయ్య, సబ్ డివిజన్ ప్రసిడెంట్ నర్సిరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ దయాకర్, బాలు నాయక్, వెంకటేష్, మహేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి తోడ్పాటు

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుంటూరు గ్రామానికి చెందిన బీరప్ప ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో బీరప్ప కుటుంబానికి అండగా నిలవాలని స్నేహితులు, బంధువులు ముందుకు వచ్చారు. వారంతా కలిసి ఇంటిపై ఉన్న అప్పు తీర్చేందుకు రూ.1,50,000 ఆర్థిక సాయం చేసి చేయూతనిచ్చారు.

జర్నలిస్టుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

కందనూలు: జర్నలిస్టుల ఆరోగ్యానికి టీయూడబ్ల్యూజే ప్రాధాన్యం ఇస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సగర సంఘం కార్యాలయంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోలి సుదర్శన్‌రెడ్డి, ముడావత్ రాములు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. త్వరలో జిల్లా కేంద్రంలో ఉచిత హెల్త్ క్యాంపును నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఓ ప్రతిక స్టాఫ్ రిపోర్టర్ ఎస్ఎస్ బాబు కుమారుడు యోగి వర్మ ఇటీవల హైదరాబాద్‌లో బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆకస్మాత్తుగా మరణించాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. బొగ్గులపల్లి రాంరెడ్డి, కంచర్ల శ్యాంసుందర్, సందు యాదగిరి, గంటి సాయిలు, అల్లంపల్లి రమేష్‌బాబు, పుట్టపాగ వెంకటస్వామి, కొండకింది మాధవరెడ్డి, హకీమ్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుల రాక

పాన్‌గల్: మండల కేంద్రానికి బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, కోళ్ల వెంకటేష్‌తో పాటు సంఘం రాష్ట్ర నాయకులు కూడా హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రామకృష్ణ, స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఎస్సీలపై జరుగుతున్న దాడులపై స్థానిక పోలీసులతో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చర్చిస్తారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



మెమొంటోను అందజేస్తున్న నిర్వాహకులు, గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లిలో ఉగాది పండుగ సందర్భంగా బంగ్లా రాములు జ్ఞాపకార్థం వారి కుమారులు బంగ్లా సుజీవన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంగళాయిపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మంగళవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు, మెమొంటో, రన్నర్ జట్టుకు రూ.5 వేలు నగదు, మెమొంటోను అందజేశారు. గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన గ్రామస్తులు, యువతకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బంగ్లా సుజీవన్, మురళి, బండి ఆంజనేయులు, బీంరెడ్డి, నారాయణరెడ్డి, కరాటే గోపాల్, నర్సింహ, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.